క్లుప్తంగా

కుక్కల దాడిలో మూడు గొర్రెలు మృతి

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామంలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో మూడు గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. కల్వలపాలెం గ్రామానికి చెందిన కదారి వెంకన్న తన గొర్రెలను ఆదివారం రాత్రి కొట్టంలో ఉంచాడు. సోమవారం తెల్లవారు జామున వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో మూడు గొర్రెలు మృతిచెందగా మరో మూడు తీవ్రంగా గాయపడ్డాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.40 వేలకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

విద్యుదాఘాతంతో గేదె..

నిడమనూరు: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని గుంపెల్లిలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గుంపెల్లి గ్రామానికి చెందిన చిమట కేశవులు సోమవారం తన గేదెలను మేత కోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో తెగి పడిన విద్యుత్ వైరు తగిలి ఒక గేదె అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవి



నియామక పత్రం అందుకుంటున్న రవికుమార్

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శిగా మిర్యాలగూడ మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి చెందిన ఉబ్బాని రవికుమార్‌ను నియమితులయ్యారు. సోమవారం క్రిస్టియన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు జాషువా డానియల్, రాష్ట్ర అధ్యక్షుడు మాదన్న చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆయన నియామక పత్రం అందుకున్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా అశోక్



అశోక్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

మాడుగులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన పందిరి అశోక్ నియమితులయ్యారు. అశోక్‌కు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమళ్ల శంకర్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ జాహంగీర్, సలీం, నూకపంగ నాగయ్య, పుట్ట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, యూత్ ఫర్ సేవా సంస్థ సభ్యులు

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ అంబటి రాము పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు ఠాకూర్ రాజారాంసింగ్, అంబటి వెంకన్న, సింగం వెంకన్న, యూత్ ఫర్ సేవా సంస్థ సభ్యులు అంబటి సైదులు, అంబటి గణేష్, బోగోజు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మన్నెం రంజిత్‌యాదవ్

నిడమనూరు: మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన బాడుగ జగదీశ్ ఇల్లు ఇటీవల విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఊరూరా తిరుగుతూ ఇడ్లీలు అమ్ముకునే జగదీశ్ గురించి తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అంకతి వెంకటరమణ, పీఏసీఎస్ డైరెక్టర్ జానయ్య తదితరులున్నారు.

క్లబ్బులు, పార్కుల క్రమబద్ధీకరణకు యత్నం

- జీఓ నంబర్లు 58, 59 ప్రకారం దరఖాస్తు చేస్తున్న అక్రమార్కులు
- విచారణ జరిపి తిరస్కరిస్తున్న అధికారులు

నాగార్జునసాగర్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను జీఓ నంబర్లు 58, 59 ప్రకారం క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జీఓ 58 ప్రకారం 120 గజాల లోపు స్థలంలో ఇల్లు ఉంటే ఉచితంగా ప్రభుత్వం ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తుంది. జీఓ 59 ప్రకారం మార్కెట్ రేటు చెల్లిస్తే ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుంది. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆ ఇంట్లో దరఖాస్తుదారులే ఉంటున్నారా? ఎన్నాళ్ల నుంచి ఉంటున్నారని విచారణ జరుపుతున్నారు. జూన్ 2, 2020 లోపు నివాసితులుగా ఉండాలనే నిబంధన ఉంది. ఇదే అదునుగా భావించిన అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు నందికొండ మున్సిపాలిటీలోని క్లబ్బులు, పార్కులు తమవేనంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఇవే కాకుండా ఒక్కో ఇంటికి రెండు మూడు దరఖాస్తులు చేశారు. వీటిపై విచారించేందుకు గాను మిర్యాలగూడ ఆర్డీఓతో పాటు మరో నలుగురు తహసీల్దార్లను నియమించారు. వీరంతా గత వారం రోజులుగా నందికొండలోని హిల్ కాలనీ, పైలాన్‌కాలనీలలో తిరుగుతూ విచారణ చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి దరఖాస్తులు చేసుకున్న వాటిని తహసీల్దార్లు నిరాకరించడంతో క్లబ్బులు, పార్కుల బాగోతం వెలుగులోకి వచ్చింది. ఒకే ఇంటిమీద కావాలనే ఇద్దరు ముగ్గురు దరఖాస్తు చేసుకోగా వాటిని ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్, ఆర్డీఓలే పరిశీలించి అనర్హులైన వారి దరఖాస్తులను తిరస్కరిస్తూ అర్హులైన వారి దరఖాస్తులకు సమ్మతం తెలుపుతున్నారు. జీఓ 59 ప్రకారం ఇంట్లో నివాసితులుగా ఎవరుంటే వారి దరఖాస్తులనే పరిశీలనలోకి తీసుకుంటున్నారు. జీఓ 58 కింద 943 దరఖాస్తులు రాగా 116 దరఖాస్తుల విచారణ పూర్తయ్యింది. అదేవిధంగా జీఓ 59 కింద 1388మంది దరఖాస్తు చేసుకోగా 556 దరఖాస్తుల విచారణ పూర్తయినట్లు మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య తెలిపారు.



నందికొండలోని ఇళ్ల వద్ద విచారిస్తున్న మిర్యాలగూడ ఆర్డీఓ, పెద్దవూర తహసీల్దార్

వారంలోగా పూర్తి చేయాలంటూ ఆదేశాలు..

వారంలోగా విచారణ పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ నెల 31లోగా తహసీల్దారులంతా బదిలీ అయ్యి కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంది. అందుకే వారంలోగా దరఖాస్తులన్నింటినీ విచారణ పూర్తిచేయాలి. ఈ మేరకు తహసీల్దారుల మీద ఒత్తిడి పెంచి రోజు రోజు ఎన్ని దరఖాస్తులు విచారించారంటూ వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

త్రిశంకు స్వర్గంలో ఎన్ఎస్‌పీ ఉద్యోగులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్ఎస్‌పీ క్వార్టర్లలో నివాసితులుగా ఉన్నారు. వారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. గతంలో అవకాశమిచ్చినపుడు వారు దరఖాస్తు చేసుకోగా వారివి నిరాకరించారు. అందులో 35మంది దరఖాస్తులను సమ్మతి తెలిపి వారు ప్రభుత్వం ఇచ్చిన డిమాండ్ నోటీసు ప్రకారం అమౌంట్ పే చేయడంతో వారికి రిజిస్ట్రేషన్ చేశారు. మరోసారి అవకాశమివ్వడంతో ఉద్యోగులంతా దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి కొంతమంది ఎన్ఎస్‌పీ ఉద్యోగులు జాబితాలోని వారి పేర్లను తొలగించుకొని అదర్ డిపార్టుమెంట్ వారి పేర్లను చేర్చారు. దీంతో గతంలో లేని క్వార్టర్లు ప్రభుత్వ పూల్‌లోకి వెళ్లడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

> **దరఖాస్తులను తిరస్కరిస్తున్నాం**
>
> ప్రభుత్వ స్థలాలైన పార్కులు, క్లబ్బులకు దరఖాస్తు చేసుకుంటే తిరస్కరిస్తున్నాం. ఒకే ఇంటికి రెండు, మూడు దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులైన వారి దరఖాస్తులనే స్వీకరిస్తాం. ఎన్ఎస్‌పీ పూల్‌లో ఉన్న 260 ఇళ్ల దరఖాస్తుల విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.
>
> – చెన్నయ్య, మిర్యాలగూడ ఆర్డీఓ, విచారణ అధికారి

మహిళా సాధికారతకు సీఎం కేసీఆర్ కృషి

మిర్యాలగూడ: రాష్ట్రంలోని మహిళల సాధికారతకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. దామరచర్ల మండలం వాడపల్లిలో రూ.5లక్షలతో చేపట్టిన స్త్రీశక్తి భవన నిర్మాణానికి, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్ కింద గాంధీనగర్ ఆవాసంలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, సర్పంచ్ కుందూటి మాధవీసిద్దయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ యూసుఫ్, ఎంపీటీసీ కామేపల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన రావులపెంట భిక్షం బీఆర్ఎస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. సోమవారం భిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం వద్ద రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగార్జునచారి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, మార్కెట్ డైరెక్టర్ చిలుక విద్యాసాగర్, జంకుతండా సర్పంచ్ మాలోతు రవీందర్‌నాయక్, నాయకులు చింతల వెంకటేశ్వర్లు, భిక్షనాయక్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లిలో స్త్రీశక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అభివృద్ధికి ఆకర్షితులయ్యే బీఆర్ఎస్‌లో చేరిక

హాలియా: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నిడమనూరు మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నిడమనూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాటి సత్యపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మెరుగు రామలింగయ్య, ఎంపీటీసీ పెద్దమాము యాదయ్య, డైరెక్టర్ నర్సింగ్ లచ్చయ్య తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన షేక్ అజ్గర్ సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ గ్రామానికి చేరుకొని అజ్గర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్, పెద్దదేవులపల్లి ఎంపీటీసీ అంబటి రాము, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



హాలియా: కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

రైతుల అభివృద్ధికి బుసిరెడ్డి ఫౌండేషన్ కృషి

హాలియా: రైతుల అభివృద్ధికి బుసిరెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అనుముల మండలంలోని శ్రీనాథపురంలో రైతు శేఖర్‌రెడ్డి పొలంలో ఉచితంగా డ్రోన్ సహాయంతో చేపట్టిన పురుగుల మందు పిచికారీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని డ్రోన్ల సహాయంతో ఎరువులు, మందుల పిచికారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం డ్రోన్లతో రైతు పొలంలోని నాలుగు ఎకరాల్లో ఉచితంగా పురుగుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు విజయ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కేతావత్ జ్యోతీరామకృష్ణ, ఉప సర్పంచ్ జబీన్ జలీల్ పాషా, తిరుమలనాథ చైర్మన్ బుర్రి రాంరెడ్డి పాల్గొన్నారు.



డ్రోన్‌తో ఎరువుల పిచికారీని ప్రారంభిస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి

ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని వినతి

కొండమల్లేపల్లి: మండలంలోని కొల్ముంతలపహాడ్ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 202లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ రమేశ్‌నాయక్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని సర్వే నంబర్ 202లో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేయాలనే దురుద్దేశంతో అక్కడ అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్యార యాదగిరి, హరి, కూర శ్రీకాంత్, కిన్నెర యాదయ్య, మురళీ, నాగేశ్ తదితరులు ఉన్నారు.

బస్తీ దవాఖానా ప్రారంభం

దేవరకొండ: పట్టణంలోని 6వ వార్డులో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను సోమవారం ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల చెంతకే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. కాలనీవాసులు బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కృష్ణకుమారి, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, టీవీఎన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు గోపాలదాసు చెన్నయ్య, రయీస్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

అభివృద్ధి పనుల పరిశీలన



కంపోస్ట్ ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ

వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర బృందాలు పరిశీలన చేసి ఉత్తమ గ్రామాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2023 అవార్డులు అందజేస్తారని అన్నారు. ఇందుకోసం తీసుకోవాల్సిన చర్యలను గ్రామపంచాయతీ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్, ఎంపీఓ సంగీత, ఏపీఎం మిరాజ్‌అలీ, సర్పంచ్ మజ్జిగపు పద్మ, కార్యదర్శి దివ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్

త్రిపురారం: గ్రామపంచాయతీ కార్మికుల శ్రమను దోచుకుంటూ సీఎం కేసీఆర్ కార్మికులను మోసం చేస్తున్నాడని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమళ్ల వెంకటేష్ విమర్శించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 19వ రోజూ కొనసాగింది. ఆదిమళ్ల వెంకటేశ్ పార్టీ నాయకులతో కలిసి కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటేశ్వర్లు, బీఎస్పీ నియోజకవర్గ మహిళా కన్వీనర్ బైరాగి విజయ, త్రిపురారం మండల అధ్యక్షుడు జిల్లా మధు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయాలుగా మారిన కేజీబీవీలు

పెద్దవూర: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కమ్మంపాటి శంకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీ గేటు ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులవుతున్నా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. కలెక్టర్, డీఈఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కేజీబీవీలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలన్నారు. ప్రభుత్వ మెనూను అమలు చేయని ఎస్ఓలను తొలగించాలని అన్నారు. ఈ నెల 31 లోపు కేజీబీవీ సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు



దేవరకొండ: మున్సిపల్ చైర్మన్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిర్యాలగూడ: వాడపల్లిలో కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



హాలియాలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) జన్మదిన వేడుకలను సోమవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువకులతో కలిసి ఎమ్మెల్యే రక్తదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, సాదం సంపత్‌కుమార్, కర్ల బ్రహ్మారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ: దామరచర్ల మండల పరిధిలోని వాడపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ యూసుఫ్, మిర్యాలగూడ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీటీసీ కామేపల్లి అనంతలక్ష్మి, లాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, టీవీఎన్‌రెడ్డి, రయీస్, సైదులు, చెన్నయ్య, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) ఎంపీపీ భగవాన్ నాయక్, పెద్దవూర ఎంపీపీ చెన్ను అనురాధ, అనుముల ఎంపీపీ సుమతి, నందికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు నిమ్మల ఇందిర, మంగ్తానాయక్, రమేశ్‌జీ నాయకులు కొండయ్య, విక్రం, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్: విజయవిహార్‌లో ఎమ్మెల్సీ కోటిరెడ్డికి కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ప్రైవేట్ చాపర్‌తో కేటీఆర్‌కు శుభాకాంక్షలు..

నిడమనూరు: మండలంలోని యర్రబెల్లికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ సోమవారం మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా యూకేలోని నాటింగమ్ సిటీలో ప్రైవేట్ చాపర్‌కు 'ఫ్యూచర్ సీఎం కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు' అని బ్యానర్‌ను కట్టించి ఆకాశంలో ఎగిరేలా చేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

గుర్రం జాషువాకు నివాళి

దేవరకొండ: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కంబాలపల్లి వెంకటయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, చొల్లేటి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి

దేవరకొండ: రాజకీయాల్లో ముదిరాజ్ కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ముదిరాజ్ సంఘం దేవరకొండ అధ్యక్షుడు రాచమళ్ల నాగయ్య అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి శంకర్, చింతకుంట్ల సత్యం, జింకల రవి, తూటుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మాడుగులపల్లి: మండల విద్యుత్ ఏఈగా మణిదీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సలహాదారు పోకల రాజు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు తీగల జాన్ శాస్త్రి, వేములపల్లి విద్యుత్ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించాలని వినతి

చింతపల్లి: చింతపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 168, 169లో అయ్యప్ప దేవాలయానికి వెయ్యి గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాజుకు సోమవారం అయ్యప్ప సేవా సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. సేవా సమితి అధ్యక్షుడు చెనమోని రాములు, చెట్లపల్లి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అడవిదేవులపల్లి: మండల పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అబ్రహాం, అధ్యక్షుడిగా పి. హర్యానాయక్, ఉపాధ్యక్షుడిగా ఏలియ్, ప్రధాన కార్యదర్శిగా కోరినేలు, జాయింట్ కార్యదర్శిగా కె. పాల్, కన్వీనర్‌గా రాజు, కోశాధికారిగా మార్క్‌రాజు, సలహాదారులుగా బౌసింగ్‌నాయక్, లుకానాయక్, బాలునాయక్‌ను ఎన్నుకున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం చింతపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏలు పాలాభిషేకం నిర్వహించారు.

మిర్యాలగూడ టౌన్: వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయడాన్ని హర్షిస్తూ సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

పరామర్శ

నిడమనూరు: మండలంలోని తుమ్మడం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి, ఆయన కుమారుడు యడవెల్లి వల్లభరెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సోమవారం పరామర్శించారు. రంగశాయిరెడ్డి కోడలు లహరిరెడ్డి పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందింది. ఈ సందర్భంగా లహరిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, మేరెడ్డి వెంకట్రాహుల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్, విజయ్, శ్రీకాంత్, సురేష్, రాంబాబు, శోభన్ తదితరులున్నారు.

విద్యాకుసుమాలకు సన్మానం

పెద్దవూర: మండలంలోని కుంకుడుచెట్టుతండాకు చెందిన రమావత్ లాలుప్రసాద్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్టీ కేటగిరీలో ఆలిండియా 97వ ర్యాంకు సాధించి ఐఐటీ రూర్కీలో సీటు సాధించాడు. అదే విధంగా అదే తండాకు చెందిన రమావత్ దినేష్‌నాయక్ జియాలజీలో డాక్టరేట్ పొందాడు. వీరిద్దరిని సోమవారం తండాలో ఎంప్లాయిస్ అండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆటో డ్రైవర్ కుమారుడైన లాలుప్రసాద్‌కు రూ.74వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దస్రు, రాందాస్, శ్రీను, దేవోజీ, రమావత్ శంకర్, యూత్ అధ్యక్షుడు రమావత్ రంగా, వైస్ ప్రెసిడెంట్ ఆర్. శంకర్, ట్రెజరర్ సేతానాయక్, రాజు, గోవింద్, రమేష్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

డీ ఫారెస్టు పట్టాలు ఇప్పించాలని వినతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని నాగార్జునపేటకు చెందిన రైతులు సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 12లో ఉన్న 430 ఎకరాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న రైతులకు డీ ఫారెస్టు పట్టాలు ఇప్పించాలని కోరారు. అదేవిధంగా సర్వే నంబర్ 32లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల కోసం 450 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా కేవలం 57 మందికి మాత్రమే పట్టాలు జారీ చేశారని పేర్కొన్నారు. కానీ అందరూ కబ్జాలో ఉన్నారని, అట్టి భూమిలో రీ సర్వే చేయించి తగిన న్యాయం చేయాలని విన్నవించారు.

విద్యార్థుల పఠనా సామర్థ్యాల పరిశీలన

గుర్రంపోడు: ప్రతి విద్యార్థి కనీస పఠనా సామర్థ్యాలను సాధించేలా తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఎంఈఓ తరి రాము అన్నారు. సోమవారం మండలంలోని చేపూరు, గుర్రంపోడు, ఉట్లపల్లి, పోచంపల్లి, తేనపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. గుర్రంపోడు జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులచే పుస్తక పఠనం చేయించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని హనుమాన్‌పేటలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు దృష్టికి కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించగా సోమవారం కౌన్సిలర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కూరపాటి సాంబశివరావు, చిలుకూరి శ్యాం తదితరులున్నారు.

అర్హులందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలి

మిర్యాలగూడ: అర్హులందరికీ ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందించాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ధనావత్ సిద్ధునాయక్ అన్నారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో సిద్ధునాయక్ మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఆదుకోవాలనే ఉద్దేశంతో గతంలో పింఛన్లను ప్రారంభించిందే కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సదానందం, దుర్గాప్రసాద్, బాలునాయక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్టాండర్డ్ క్లబ్ ఏర్పాటు

నాగార్జునసాగర్: భారత ప్రామాణిక సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) వారిచే నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ శాఖాధిపతి కె. ఆంజనేయులు ఆధ్వర్యంలో 30మంది విద్యార్థులతో సోమవారం స్టాండర్డ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐలయ్య మాట్లాడుతూ.. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు స్టాండర్డ్ క్లబ్ ఏర్పాటుకు తమ కళాశాలను ఎంపిక చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు

హాలియా, అడవిదేవులపల్లి: గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉద్యానవన శాఖ ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని హాలియా ఎంపీడీఓ లక్ష్మి, అడవిదేవులపల్లి ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఐదెకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, ఉపాధి జాబ్ కార్డులు కలిగిన రైతులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 31లోపు పట్టాదారు పాస్ పుస్తకం, పాస్ ఫొటోలతో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, వ్యవసాయ విస్తరణాధికారి, ఏపీఓ, ఎంఏఓ, ఎంపీడీఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.